ఘట్‌కేసర్ సీఐగా గోవర్ధన గిరి



తాజా, మాజీ సీఐలకు స్వాగతం, వీడ్కోలు పలుకుతున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ నూతన సీఐగా గోవర్ధన గిరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఎస్ ఎల్బీనగర్ నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఎం మహేందర్‌రెడ్డి ఎల్బీనగర్ సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య ఆధ్వర్యంలో తాజా, మాజీ సీఐలను శాలువాతో సత్కరించి స్వాగతం, వీడోలు పలికారు. అనంతరం బీజేపీ నాయకులు రవికాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి సీఐ మహేందర్‌రెడ్డిని జీపులో ఊరేగించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యయాదవ్, రవిశంకర్, మురళి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గట్టు మైసమ్మ జాతర హుండీ లెక్కింపు



ఘట్‌కేసర్: గట్టు మైసమ్మ అమ్మవారి జాతర హుండీని చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఆలయ ఈఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. వివిధ హుండీల ద్వారా రూ. 2,17,713 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. కాగా గతేడాది జాతరకు 2,12,180 లక్షలు వచ్చిందని ఈ యేడు పెరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, ముత్యాలు యాదవ్, అంజిరెడ్డి, జంగయ్యయాదవ్, నారాయణ, జంగారెడ్డి, రాధాకృష్ణముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, స్థానికులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొల్తూర్‌లో ఉచిత వైద్య శిబిరం

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామంలో మెడిసిటి దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, ఊపిరితిత్తులతో పాటు ఇతర పరీక్షలు చేసి మందులు అందజేశారు. మొత్తం 133కి పరీక్షలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఒమార్, అభిషేక్, కావ్య, జాహ్నవి, దివ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే సత్తా ప్రభుత్వానికి లేదు

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి
- మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ కృతజ్ఞత సభకు హాజరు



శామీర్‌పేట్: సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే సత్తా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి లేకే ప్రత్యేక అధికారులతో పాలన నిర్వహణకు ప్రభుత్వం మొగ్గుచూపుతుందని మాజీ మంత్రి, సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి విజయం సాధించిన సందర్భంగా అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్‌లో సోమవారం కృతజ్ఞత సభ నిర్వహించారు. ఆమెతో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి పాలన చేతకాదని ప్రజలకు అర్థమైందని, సర్పంచ్ ఎన్నికలకు వెళ్లే ఓటమి తప్పదని సీఎం రేవంత్‌రెడ్డి గమనించే సర్పంచ్ ఎన్నికలు వాయిదా వేశారని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్లు దీపిక, లక్ష్మి, జడ్పీటీసీ శైలజ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దయాకర్‌రెడ్డి. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండలసమావేశం

మేడ్చల్: మేడ్చల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 30న (నేడు) నిర్వహించనున్నట్లు ఎంపీపీ రజితరాజామల్లారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. అలాగే అధికారులు తమ శాఖల పూర్తి నివేదికలతో రావాలని ఆమె సూచించారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

- జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి
- జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అట్రాసిటీ కేసులపై సమీక్ష
- హాజరైన మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కలెక్టర్ గౌతం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: అట్రాసిటీ కేసుల బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు చూడాలని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన వారిపై పలు ఒత్తిడులు వస్తుంటాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని వారికి పోలీసులు, ఇతర శాఖల అధికారులు అండగా నిలవాలని సూచించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసు నమోదైన వెంటనే దర్యాప్తు ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

కేసుల్లో ప్రత్యేక చొరవ చూపాలి: కలెక్టర్ గౌతం

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా సంబంధిత జిల్లా శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) – పీసీఆర్), అట్రాసిటీ నివారణ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ – పీవోఏ) చట్టాలను కచ్చితంగా అమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కేసులకు సంబంధించి రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులను తమ పరిధిలో ఇప్పటివరకు ఉన్న కేసుల వివరాలు, వాటి పురోగతిపై కలెక్టర్ ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్‌కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులను కలెక్టర్ కోరారు. సమావేశంలో మేడ్చల్ డీసీపీ నిఖితపంత్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఎస్సీ, ఎస్సీ కమిటీ మెంబర్లు వెంకటేశ్, ధనరాజ్ నాయక్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కేటీఆర్‌వి అహంకార పూరిత మాటలు'

సాక్షి,మేడ్చల్ జిల్లా: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు అహంకార పూరితమైనవని, ఓటమిని జీర్ణించుకోలేకనే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఇంకోసారి విమర్శిస్తే తరిమి కొడతామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రజా తీర్పును గౌరవించడం చేతకానీ కేటీఆర్ సీఎంపై అనవసరమైన ప్రేలపానలు పేలుతున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన ఆ పార్టీ నేతల్లో మార్పు రాలేదని, పిచ్చి పట్టిన రీతిలో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. గత పదేళ్లలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, గడిలకే పరిమితమైన పాలనను గ్రామాల్లోకి తెచ్చి ప్రజా పాలనను అందిస్తుంటే , సహించలేకనే దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కారు పార్టీ కనుమరుగు కావడం ఖాయమని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కేటీఆర్ నోరు అదుపులో ఉంచుకోవాలని లేకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, లీడర్లు రోడ్లపైకి రాలేరని హెచ్చరించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
- కలెక్టరేట్ ప్రజావాణికి 129 ఫిర్యాదులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: అర్జీలనుపెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ప్రజల నుంచి 129 అర్జీలు స్వీకరించారు. ఇందులో భూవివాదాలు ,ధరణి, డబుల్ బెడ్రూం ఇళ్లు , అక్రమ కట్టడాలు , భూకబ్జాలు తదితర వాటికి సంబంధించిన ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల ప్రదర్శన



వివరాలు తెలుసుకుంటున్న యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులు తయారు చేసిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనను సోమవారం నిర్వహించారు. సీఎస్ఈ విద్యార్థులు విండోస్ ఆపరేటింగ్ సిస్టం తరహాలో అనురాగ్ ఆపరేటింగ్ సిస్టం (ఏఓఎస్)ను అభివృద్ధి చేశారు. ఈ సిస్టమ్ మైక్రోసాఫ్ట్ విండోస్‌లోని లోపాలు అధిగమించేందుకు తక్కువ వ్యయంతో ఎక్కువ సాంకేతికత అందుబాటులోకి తేచ్చే ప్రయత్నమని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా "స్టార్టప్ ఇన్నోవేషన్ కోసం అనుభవకపూర్వక విద్యనభ్యసించే విధానం"పై చర్చించారు. అనంతరం యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గొప్ప ఆలోచనలు ఎప్పుడైనా.. ఎక్కడైనా.. రావచ్చని, ఆవిష్కరణలకు నిర్మాణాత్మకమైన అభ్యాసం ముఖ్యమన్నారు. తరగతి గదుల్లో 30 శాతం మాత్రమే అభ్యాసం జరుగుతుందని, తరగతి బయట బ్యాలెన్స్ జరుగుతుందన్నారు. భారత్‌లో అట్టడుగు స్థాయి సవాళ్లు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ యూబీ దేశాయ్, సతీశ్, శాంత టౌతం, రిజిస్ట్రార్ బాలాజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌ను అందరికీ అందుబాటులో ఉంచాలి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మేడ్చల్: మండలంలోని శ్రీరంగవరంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను గ్రామంలోని అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు గ్రామస్తులు ఎంపీడీవో పద్మావతికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయం పక్కన ఎమ్మెల్యే నిధులతో నిర్మించి ప్రారంభించారని ఈ నెల 27న రాత్రికి రాత్రి భవనం పేరును మార్చారని పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శిని తాము అడగగా తనకు తెలియదని సమాధానం ఇస్తున్నారని చెప్పారు.భవనం పేరును కమ్యూనిటీ హాల్‌గా ఉంచి అందరికి అందుబాటులో ఉండేలా చూడాలని కోరామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పోచయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

జవహర్‌నగర్: భార్యభర్తల మధ్య గొడవతో భార్య అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా జమ్మిగడల్లో నివసించే పి.నాగరాజు వాచ్‌మెన్ ఉద్యోగం చేస్తున్నాడు. 2023 డిసెంబర్ 24న భార్య కవిత (32)తో మనస్పర్థాలు జరగగా మరుసటి రోజు 25న ఉదయం నిద్రలేచి చూడగా భార్య కవిత కనిపించలేదు. తిరిగి నెల రోజుల తర్వాత ఇంటికి వచ్చింది. మళ్లీ ఈ నెల 28న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి..



అనూష

హకీంపేట సీఐఎస్ఎఫ్ గేట్–2 వద్ద నివసించే నూకంటి నాగరాజు, భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో ఉంటున్నారు. ఈ నెల 28న కుటుంబసభ్యులతో కలిసి ఏలూరి నర్సింహాస్వామి దర్శనానికి వెళ్లారు. పెద్ద కుమార్తె నూరకంటి అనూష (26) ఇంటి వద్దే ఉంది. అనూషకు పలుమార్లు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి వచ్చి చూడగా అనూష కనిపించలేదు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

మేడ్చల్ రూరల్: నడుచుకుంటూ వెళ్తున్న యువతిని ట్రాక్టర్ ఢీకొట్టగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి కిష్టాపూర్ గ్రామానికి చెందిన ప్రభాషిణి (19) మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఓ చాకెట్ల్ కంపెనీలో కార్మికురాలిగా పనిచేస్తున్నది. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డా యువతిని చికిత్స కోసం కొంపల్లిలోని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ దవాఖానలో యువకుడు..

ఘట్‌కేసర్: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఘట్‌కేసర్ సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నేరెడ్‌మెట్ వినాయకనగర్‌కు చెందిన హరీశ్, దేవసాని గణేశ్ (29) ఈ నెల 27న బైక్‌పై వరంగల్‌లోని కాజీపేట్‌కు వెళ్లారు. అదేరోజు హైదరాబాద్‌కు వస్తుండగా ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీనగర్ రైల్వే వంతెన సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వారి ముందు వెళ్తున్న లారీనీ ఢీకొట్టారు. దీంతో గణేశ్ తలకు తీవ్ర గాయాలు కాగా, హరీశ్‌కు కాలు విరిగింది. పోలీసులు వారిని చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి గణేశ్ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించండి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, గిరిజనులు

మేడ్చల్: మండలంలోని రావల్‌కోల్ పరిధిలోని గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రావల్‌కోల్‌లోని జీవన్‌రెడ్డి తోట నుంచి గూడెంగడ్డ తండా, దొంగలగుట్ట తండా వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాదాపు 400 మంది జనాభా నివసిస్తున్న తండాల్లోని పిల్లలు చదువుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లలేక మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రావల్‌కోల్ నుంచి తండాలకు మెరుగైన రోడ్డు నిర్మించాలని కోరారు. అందజేసిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి నరేశ్, నాయకులు కొమురయ్య, తండావాసులు శారద, సుజాత, కమల, వంశీ, రాజు, కమల, బానోత్ సుజాత పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘం నాయకులు, కార్మికులు

మేడ్చల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16 న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ పిలుపునిచ్చారు. మేడ్చల్‌లో సమ్మె పోస్టర్‌ను విడుదల చేసి సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అచ్చేదిన్, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా అంటూ మాయమాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజవనరులను కార్పొరేట్ బజార్‌లో వేలం వేస్తున్నాడని, అలాగే కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ జిల్లాలోని అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన, రవాణా, హమాలీలు, భవన నిర్మాణ రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ దేవేందర్, నాయకులు రమేశ్, నర్సింగ్, ప్రేమలత, విజయ, భాగ్యమ్మ, బాలమణి, సుధాకర్‌రావు, మంజుల, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్-రాంపల్లిలో క్రీడాదినోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం

కీసర: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్ మరింత ఉన్నతంగా ఉంటుందని జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్ రాంపల్లి పాఠశాల చైర్మన్ హరిశ్చంద్ర ప్రసాద్ అన్నారు. పాఠశాలలో క్రీడా దినోత్సవ వేడుకలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక , శారీరక, వికాసానికి దోహదపడుతాయన్నారు. తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు, క్రీడాపోటీల్లో పాల్గొంటూ బహుమతులు సాధిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. కార్ట్‌వీల్, హిప్‌రోటేషన్, బాంబు స్టిక్‌వాక్, 100 మీ, 200 మీ, 400 మీటర్ల పరుగు పందెం, సారీడ్రిల్, దాండియా, సైకిల్‌స్టంట్స్, హుప్‌డ్రిల్, షాట్‌పుట్, లాంగ్ జంప్, జిమ్నాస్టిక్, త్వైకాండో, ట్రిపుల్‌జంప్, టైర్ క్లైంబింగ్, స్టీపుల్‌చేస్ (సైనిక విన్యాసాలు) మొదలైన వాటిలో విద్యార్థుల ప్రతిభ, క్రీడా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా క్రీడాపోటీలు నిర్వహించారు.అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుచరితరాయ్, అకాడమిక్ డైరెక్టర్ ప్రమోద్‌శామ్ జోయిస్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలు ,ఆశ్రమ పాఠశాలు, కళాశాల హాస్టళ్లకు సంబంధించిన మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్ ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వాన్ని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని చాలాసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలను అమలుచేయకపోవటంతో వార్డెన్లు అప్పులు తెచ్చి హాస్టళ్లు నడుపుతున్నారని, దీంతో పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కల్పించ లేకపోతున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పెడతామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో షిఫ్ట్‌వైస్‌గా నడుస్తున్న జూనియర్, డిగ్రీ కళాశాలలను రెగ్యులర్‌గా నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల్లో నూతన జూనియర్ కళాశాలలు, మేడ్చల్ నియోజవర్గంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉప్పల్ మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలన్నారు. అలాగే జిల్లాలో గుర్తింపులేని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చాలా విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ ,టీచర్స్, వర్కర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సుమంత్, వంశీ, మనీకందు, అరుణ్, శ్యాంరావు, కార్తీక్, అవినాశ్, అనుదీప్, శివసాయి, మనీశ్, అజయ్, గిరిధర్, రాకేశ్, భూపతి పాల్గొన్నారు.

భూమి సర్కారుది.. ఆదాయం ప్రైవేట్‌కు

- రోడ్డు కోసం సేకరించిన భూముల్లో హోర్డింగ్‌లు
- ప్రైవేట్ ఏజన్సీల చేతిలో హెచ్ఎండీఏ రోడ్డు భూములు

ఘట్‌కేసర్: ప్రభుత్వ భూముల్లో ప్రైవేట్ పెత్తనం కొనసాగుతున్నా.. వాటిని కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు విస్తరణ, ఓఆర్ఆర్ జంక్షన్ కోసం సేకరించిన భూముల్లో ప్రైవేట్ పెత్తనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో హెచ్ఎండీఏకు చెందిన భూమిలో హోర్డింగ్‌ల ఏర్పాటును ప్రైవేట్ ఏజన్సీలకు అప్పగించడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఆదాయం కోసం స్థానిక ఎమ్మెల్యే అండతోనే ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా అప్పగిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు.



ఘట్‌కేసర్‌లో ఓఆర్ఆర్ జంక్షన్ కోసం సేకరించిన భూమిలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు



ఘట్‌కేసర్ అండర్ పాస్ వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్

అండర్ పాస్ వద్ద రోడ్డు భూమిలో హోర్డింగ్..

హైదరాబాద్–భూపాలపల్లి జాతీయ రహదారికి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని కలపడానికి ఘట్‌కేసర్ వద్ద వీయూపీ (వేహికిల్ అండర్ పాస్)ని నిర్మించారు. ప్రభుత్వం 2014లో సర్వేనంబర్ 310, 313, 382, 386, 398, 432లో నాలుగు లేన్ల కోసం భూమిని సేకరించి భూ యజమానులకు రూ. 4.5 కోట్లు నష్టపరిహారం చెల్లించింది. అదేవిధంగా ఘట్‌కేసర్–అబ్దుల్లాపూర్‌మెట్ వరకు వాహనాలు వెళ్లేందుకు 100 ఫీట్ల రోడ్డు నిర్మించాలని భూమిని సేకరించి పరిహారం కూడా చెల్లించారు. కానీ రోడ్డును 66 ఫీట్ల వరకు రోడ్డు నిర్మించి మిగిలిన భూమిని అలాగే వదిలేయడంతో 34 ఫీట్ల భూమి పాత యజమానుల చేతిల్లోనే ఉండిపోయింది.

ఓఆర్ఆర్ జంక్షన్‌లో..

సర్వేనంబర్ 575, అలాగే 580లో ఓఆర్ఆర్ జంక్షన్ కోసం 5.17 ఎకరాల భూమిని నోటిఫై చేసి 3.37 ఎకరాల భూమికి నష్టపరిహారం కోర్టులో జమచేశారు. అందులో 1.20 ఎకరాల భూమి ఘట్‌కేసర్–ఈసీఐఎల్ రోడ్డు, జాతీయ రహదారిలో ఉంది. 581లో 5 గుంటల భూమి జాతీయ రహదారి ఉంది. కాగా మున్సిపాలిటీ ఆదాయం కోసం ఓఆర్ఆర్ జంక్షన్ కోసం ప్రభుత్వం సేకరించిన భూమిలో హోర్డింగ్‌ల ఏర్పాటును ప్రైవేట్ ఏజన్సీలకు అప్పగించారు. దీంతో నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారు. హెచ్ఎండీఏ, జాతీయ రహదారికి చెందిన భూమిలో హోర్డింగ్‌ల ఏర్పాటుకు ఎలా అనుమతి ఇస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అండర్ పాస్‌వద్ద ఇరువైపుల ప్రైవేట్ వ్యక్తుల నిర్మాణాలు చేపట్టి అద్దెకిచ్చి లక్షలు సంపాదిస్తున్నారు. అక్కడ నిర్వహిస్తున్న మద్యం, ఇతర దుకాణాలతో వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఓఆర్ఆర్ జంక్షన్, రోడ్డు విస్తరణ కోసం సేకరించిన భూమిలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ల అనుమతి రద్దు చేయాలని, అలాగే రోడ్డు కోసం సేకరించిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. హోర్డింగ్‌ల ఏర్పాటు. అనుమతి విషయమై ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులో లేరు.